కథ

ప్రభా సుబ్బారావు

# సాంప్రదాయాలు-సమర్థింపులు

“మాది చాలా చక్కటి సాంప్రదాయకమైన కుటుంబం. మా పిల్లలు నల్గురికీ పరువు, ప్రతిష్ఠగల కుటుంబాల నుండి సంబంధాలు అందుకొన్నాం. ఇప్పుడు మా మనుమరాలికి కూడా అల్లాగే సాంప్రదాయకంగా ఉండే కుటుంబం నుండి పిల్లవాడిని చూస్తున్నాం” మీసాలు దువ్వుకొంటూ హుందాగా చెప్పారు పరంధామయ్యగారు.

“ఔనండీ. మీరు ఏ పని చేసినా పరువు, ప్రతిష్ఠ ఆలోచించే చేస్తారు. మీ కుటుంబం చాలా పద్ధతైన కుటుంబం. అందునా మీ పిల్లలు ఇప్పటి పిల్లల్లా కాకుండా మీరు కుదిర్చిన సంబంధాలు ఎదురు చెప్పకుండా చేసుకొన్నారు” కాలక్షేపం కబుర్లకోసం వచ్చిన చంద్రం అన్నాడు. నాలుగు పొగడ్తలు పొగిడి వాళ్లిచ్చిన కాఫీ, ఫలహారాలు సేవించి బ్రేవ్‌మని తేనుస్తూ వెళ్లడం చంద్రం అలవాటు.

“ఏం పరువూ ప్రతిష్ఠయ్యా బాబూ. ఏ కుటుంబం చూసినా ఏదో ఒక లోటు కన్పిస్తుంది. మొన్నటికి మొన్న గుంటూరు నుండి వచ్చిన సంబంధం అన్ని విధాలగానూ బాగుంది అనుకొంటే వాకబు చెయ్యగా తేలిందేమిటంటే ఆ అబ్బాయి తల్లీ, తండ్రీ కులాంతర వివాహమట. అబ్బాయి తండ్రిది మన కులమే అని వెళ్లామా! తల్లిది వేరే కులమట. ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆ దంపతుల్ని చూస్తే ముచ్చటేసిందయ్యా చంద్రం. ఎంత మర్యాద, ఎంత ఆప్యాయత. పిల్లలు కూడా ముచ్చటగా ఉన్నారయ్యా. మనం చూసిన పిల్లాడు డాక్టరు. ఈ ఒక్క కులాంతరం అనే లోటు లేకపోతే విడిచిపెట్టే సంబంధం కాదయ్యా అది” తన్మయత్వంగా చెప్పారు.

“తమరేమనుకోనంటే ఒక మాట చెబుతాను. మన వీధి చివరన ఉండే రామారావుగారి కుటుంబంలో అన్నీ కులాంతరాలు, మతాంతరాలు కదండీ. అయినా వాళ్ల కుటుంబం చాలా సంతోషంగా ఉంటుంది కదండీ” పరంధామయ్యగారి రియాక్షన్ ఎలా ఉంటుందోనని ఆయన మొహం వైపు చూస్తూ మనసులో మాట అనేసి నాలిక్కరుచుకొన్నాడు చంద్రం. చంద్రంకి తెల్సు రామారావుగారి కుటుంబం గురించి ఎత్తితే పరంధామయ్యగార్కి నచ్చదని.

“ఆ కుటుంబం గురించి మాట్లాడాలంటేనే అసహ్యం. ఏటయ్యా చంద్రం- ఏమిటి సంగతి? రామారావు కుటుంబాన్ని పొగుడుతూ మాట్లాడుతున్నావ్. సిగ్గులేని కుటుంబం. ఒక్కరన్నా తిన్నగా పద్ధతిగా పెళ్లి చేసుకొన్నారా? ఆ రామారావు మన కులం వాడని, మన బంధువనీ చెప్పుకోడానికి కూడా సిగ్గుగా ఉందయ్యా. పిల్లలు చేసిన తప్పుడు పనులను సమర్థించి, ఎలా తలెత్తుకొని తిరుగుతున్నాడో ఇప్పటికీ అర్థం కాదయ్యా. ఇంకోసారి వాళ్ల గురించి నా దగ్గర మాట్లాడకు.” వార్నింగిచ్చారు పరంధామయ్యగారు.

‘ఆ..ఆ..నిజమేనండి. రామారావుగారి పిల్లలు ఒక్కరూ తిన్నగా పెళ్లి చేసుకోలేదు. ఇంక వెళ్లొస్తానండి” రామారావుగారి కుటుంబాన్ని ఇంకా పొగిడి పరంధామయ్యగారితో చివాట్లు తినడం ఇష్టంలేక పిల్లిలా జారుకొన్నాడు చంద్రం.

* * *

పరంధామయ్యగారు ఊళ్లో పేరు మోసిన మోతుబరి. ఆయన నోరువిప్పితే ముందుగా ‘మాది పరువుగల కుటుంబం’ అనే మాట వస్తుంది. పరువు ప్రతిష్ఠలే ప్రాణంగా బ్రతుకుతున్న మనిషి. పరంధామయ్యగారి భార్య లక్ష్మీదేవి. భర్త అడుగుజాడల్లో నడుచుకొనే ఉత్తమ ఇల్లాలు. వీరి సంతానం హరి, గిరి, కరుణ, అరుణ అని నలుగురు పిల్లలు.

పెద్దబ్బాయి హరి వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటూ డిగ్రీ పూర్తి చేసి ఉన్న ఊళ్లోనే తండ్రి అనుమతితో చిన్న బిజినెస్ కూడా చేస్తున్నాడు. చిన్నబ్బాయి గిరి మాత్రం అగ్రికల్చరల్ ఎమ్మెస్సీ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పెద్దమ్మాయి కరుణను ఇంటర్ వరకూ చదివించి దూరపు బంధువు కోటేశ్వర్రావుగారి అబ్బాయి ఆనంద్‌కిచ్చి వివాహం జరిపించారు.

కోటేశ్వరరావుగారిది కోట్లకు పడగలెత్తిన కుటుంబం. ఆనంద్ ఒక్కడే కొడుకు. కొద్దిగా చెడు వ్యసనాలు ఉన్నాయని ఆ నోటా, ఈ నోటా విన్నా ‘పెళ్లయ్యాక వాళ్లే మారతారులే’ అని తేలిగ్గా తీసుకొని వివాహం జరిపించేసారు. నాలుగో అమ్మాయి కరుణ మాత్రం తండ్రితో పోట్లాడి డిగ్రీ వరకూ చదివింది. తండ్రి దగ్గర గారాబం అవ్వడం వల్ల ఉద్యోగం చేసే అబ్బాయే కావాలని చెప్పింది. ఎక్కువ ఆస్తిపాస్తులు లేకపోయినా బాంక్ ఆఫీసర్ సుధాకర్‌కిచ్చి వివాహం జరిపించారు. హరి, గిరి తల్లిదండ్రులు కుదిర్చిన అమ్మాయిల మెళ్లో బుద్ధిగా తాళికట్టారు.


“మన రమ సంబంధం గురించి ఏం చేసారు?” భోజనం వడ్డిస్తూ అడిగింది లక్ష్మీదేవి.

“ఆ సంబంధం అన్ని రకాలుగానూ బాగుంది కానీ అబ్బాయి తల్లీతండ్రులది కులాంతర వివాహం అని తెల్సింది. అందుకే ఆలోచిస్తున్నాను.”

“ఇంతవరకూ మీ మాటకు ఎప్పుడూ ఎదురు చెప్పలేదు. మీరు ఏమీ అనుకోనంటే ఒక్క విషయం. మన పిల్లల పెళ్లిళ్లప్పుడు పాటించిన చాదస్తాలన్నీ కొంచెం పక్కన పెట్టి, మన మనుమరాలి పెళ్లి విషయంలో కొంచెం బాగా ఆలోచిస్తే బాగుంటుందేమో” భయం భయంగానే తన మనసులో మాట చెప్పేసింది లక్ష్మీదేవి.

పరంధామయ్యగార్కి కూడా ఆ సంబంధం మీద ఉన్న మక్కువ, లక్ష్మీదేవి మాటలతో ఆలోచింపజేసింది. ఎటూ మాట్లాడకుండా మౌనంగా చెయ్యి కడుక్కొని లేచారు.

మంచం మీద పడుకొన్నారే కాని ఆలోచనలతో నిద్ర రాలేదు. ‘నిజమే తను కరుణ వివాహం విషయంలో ఎక్కువ పరువు, ప్రతిష్ఠ, ఆస్తులు అని ఆలోచించి, ఆనంద్‌కి చిన్న చిన్న దురలవాట్లు ఉన్నాయని తెల్సినా మూర్ఖంగా చేసేశాడు. పాపం కరుణ పుట్టింటికి వచ్చినప్పుడల్లా భర్త గురించి చెప్పి బాధపడుతుంటుంటే ‘మనది పరువుగల కుటుంబం. ఆడపిల్ల కష్టమైనా, నష్టమైనా ఓర్చుకొని అత్తింట్లోనే ఉండాలి’ అంటూ నచ్చజెప్పి పంపించేసేవాడిని. ఎటూ మాట్లాడలేక పిచ్చి చూపులు చూస్తూ వెళ్లిపోయేది. కరుణ అత్తగారిది లంకంత ఇల్లు. ఇంట్లో ఎవరు ఏ మూల ఉంటారో తెలియదు. ఆనంద్ ఒక్కడే కొడుకు అవ్వడం వల్ల ఆడింది ఆటగా, పాడింది పాటగా సాగిపోయింది. ఫలితం...అతి గారాబం వల్ల దురలవాట్లకు బానిసయ్యాడు. కరుణ పరిస్థితి ఆ లంకంత ఇంట్లో అయోమయంలో పడేసింది. ఆదరించాల్సిన అత్త, మామలు కొడుకునే వెనకేసుకొచ్చేవారు. భారం దింపుకొందామని పుట్టింటికి వస్తే నీతులు చెప్పి పంపించేవారు. మనసులో బాధ పంచుకొనే తోడు లేక లోలోపల కృంగిపోతూనే ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. రెండవ కాన్పులో పూర్తిగా డిప్రెషన్‌కు లోనయ్యి, పిచ్చాసుపత్రిలో చేర్చే పరి




స్థితి ఏర్పడింది. అప్పటి నుండి ఆ ఆసుపత్రే పుట్టిల్లు, అత్తిల్లు అయ్యింది. ఆ ఇంట్లోనే పెరిగితే మనుమలు పాడవుతారని తన దగ్గరే పెట్టుకొని చదువు చెప్పిస్తున్నాడు. ఇప్పుడు మనుమరాలు డిగ్రీ పూర్తి చేసింది. సంబంధాలు చూస్తున్నారు. భార్య చెప్పిన దానిలో నిజం ఉంది. ఆలోచించాలి అనుకొంటూ' నిద్రపక్రమించారు పరంధామయ్య.

ప్రొద్దుట లేచేసరికి రోజుకన్నా ఆలశ్యం అయింది. ఆలోచనలతో రాత్రి సరిగ్గా నిద్రపట్టక పోవడం వల్ల లేవలేకపోయారు. హాల్లో నుండి మాటలు విన్పిస్తున్నాయి.

"ఎప్పుడూ సోఫాలు ఎక్కి తొక్కుతారు. ఇదేమన్నా మీ తాతగారి సొమ్మనుకొన్నారా?" పెద్దకోడలు రమ మాటలవి. పుట్టింటి నుండి ఫర్నిచర్ అంతా తెచ్చుకొన్నానన్న అహంకారం. పెద్దకుటుంబం. అడక్కుండా 'ఇంత కట్నం' ఇస్తాం అని ముందుకు వచ్చారు కదా అని చేసుకొంటే ఆ అమ్మాయికి వళ్లంతా అహంకారమే. వాళ్లమ్మ అత్తగారిని చూడలేదట. అందుకు ఆ అమ్మాయి కూడా చూడదట. మొదటి నుండి అత్తగారన్నా, అత్తగారింట్లో వారన్నా చిన్నచూపే. ఆలోచిస్తూనే కాలకృత్యాలు, కాఫీ అయిందనిపించారు పరంధామయ్య.

చిన్న కూతురు అరుణ లెటరు వ్రాసింది.

"పూజ్యులు నాన్నగార్కి అరుణ నమస్కరించి వ్రాయునది. నేను, మీ అల్లుడుగారు, చింటూ, బన్నీ కులాసాగా ఉన్నాము. అమ్మ, మీరు ఎట్లా ఉన్నారు? మీరు అశాంతిగా ఉన్నారని తెల్సు. ఎప్పుడూ ఏదో ఒక ప్రొబ్లమ్‌తో సతమతమవుతూ అనారోగ్యం చేతులారా తెచ్చుకొంటున్నారు.

నాన్నా! మీకు చెప్పేంత వయసు నాకు లేదని తెలుసు. కానీ నాకు తెల్సిన పరిజ్ఞానంతో కొన్ని విషయాలు మీకు తెలియపర్చకపోతే మీరు మీ చివరి జీవితం కూడా అశాంతిగానే గడపవలసి వస్తుంది. ఇంత ఖచ్చితంగా వ్రాస్తున్నందుకు క్షమించండి.

నాన్నా! మీరు ఎప్పుడూ మాట్లాడే పరువు, ప్రతిష్ఠలే మిమ్మల్ని అశాంతికి గురి చేస్తున్నాయి. నాకు ఊహ తెల్సినప్పటినుండి చూస్తున్నాను. మీరా మాటకు ఇచ్చిన విలువ దేనికీ ఇవ్వరు. కానీ నాన్నా! ఆ పరువు ప్రతిష్టలతోపాటు మనుష్యులకు కూడా విలువ నిచ్చి ఉంటే మీరు ఇప్పుడింత అశాంతితో తల్లడిల్లి ఉండేవారు కాదు. ఎక్కువ ఆస్తి ఉందని పెద్దన్నయ్యకు, అమ్మాయి చదువుకోలేదని తెల్సి కూడా మేరేజ్ చేసారు. ఆ అమ్మాయికి పోనీ చాలా అందం ఉందా అంటే అదీ లేదు. కేవలం అమ్మాయి ఆస్తిపాస్తులు, కుటుంబం, గౌరవం

అంటూ చేసారు. తెల్లారి లేస్తే వదిన చేసే వీర విహంగంతో ఇంట్లో ఎవరికీ మనశ్శాంతి ఉండడం లేదు. సరే. ఇది పక్కన పెడితే అక్క విషయంలో కూడా అట్లాగే అయ్యింది. బావగార్కి చెడ్డ అలవాట్లు ఉన్నాయని ముందే తెల్సినా పెద్దకుటుంబం, బోల్డంత ఆస్తి వుంది, ఒక్కడే కొడుకు అంటూ ఆ సంబంధం ఖాయం చేసారు. అక్క నాకు తెల్సుండి ఒక్క రోజు కూడా సుఖపడడం చూడలేదు. దాని కష్టాల్ని మీ కడుపులో దాచుకొని, అక్కున చేర్చుకొని ఉంటే ఈరోజు అక్క పిచ్చాసుపత్రిలో ఉండేది కాదు. ఈ పెద్ద వయసులో అక్కపిల్లల్ని పెంచే బాధ్యత మీకు తప్పేది.

నాన్నా! నా పేచీ భరించలేక బాంక్ ఆఫీసర్‌ని చేసినందుకు నేను బాగానే సుఖపడుతున్నాను. చిన్నన్నయ్య కూడా ఫరవాలేదు. మీ తప్పుల్ని ఎత్తి చూపిస్తున్నందుకు అన్యథా భావించ వద్దు. అక్క విషయంలో చేసిన పొరపాటు అక్క కూతురు రమ విషయంలో చేస్తారేమోనన్న భయంతో ఈ లెటరు వ్రాయడానికి సాహసించాను.

నాన్నా! గుంటూరు సంబంధం అన్ని రకాలగానూ చాలా బాగుంది. అబ్బాయి డాక్టరు. తల్లీదండ్రీ కూడా డాక్టర్లు అవ్వడం వల్ల చక్కగా కలిసి ప్రాక్టీస్ చేసుకొంటున్నారు. ఎవరిని అడిగినా ఆ కుటుంబం గురించి మురిసిపోతూ మంచిగా చెబుతున్నారు. తల్లిదండ్రులది కులాంతర వివాహం అని మీరు ఆలోచనలో పడ్డారు కదా నాన్నా.

నాన్నా మన వీధి చివర రామారావుగారి గురించి మాట్లాడితేనే మీరు అసహ్యించుకుంటారు. కానీ మీరు అసహ్యించుకొనేంత చెడ్డ కుటుంబం కాదు వాళ్లది. వాళ్ళమ్మాయి నా ఫ్రెండ్ మీకు తెల్సుకదా. వాళ్లది చాలా సంస్కారం గల కుటుంబం నాన్నా. తల్లీ, తండ్రీ, పిల్లలు స్నేహితుల్లా ఉంటారు. ఆ ఇంట్లోకి వెళ్తే దేవాలయానికి వెళ్లినంత ప్రశాంతంగా ఉంటుంది. నాన్నా! నా ఫ్రెండ్ ఉమ తన క్లాస్ మేట్ సుధాకర్ గురించి వాళ్ల పేరెంట్స్‌తో చెప్పేటప్పుడు నేను వాళ్లింట్లోనే ఉన్నాను. ఎంత క్యాజువల్‌గా చెప్పిందనుకొన్నారు. 'నాన్నారూ! నాతో సుధాకర్ అనే అబ్బాయి చదివే వాడు గుర్తుందా? ఆ అబ్బాయి ఇప్పుడు పి.జి. అవ్వగొట్టి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా చేస్తున్నాడు. ఈమధ్య మా ఆఫీసులో ఏదో పనుండి వచ్చాడు. నన్ను గుర్తుపట్టి మాట్లాడాడు. తరువాత మూడు నాలుగుసార్లు కలిశాము. నిన్న కలిసి కాఫీ త్రాగేటప్పుడు ఏమన్నాడంటే- 'ఉమగారూ కాలేజీలో చదివినప్పటి నుండీ మీరు తెల్సు. అనుకోకుండా ఇద్దరమూ ఒక ఊళ్లోనే ఉద్యోగాలు చెయ్యడం వల్ల కలిశాము. మీకు, మీ పెద్దవాళ్లకు అభ్యంతరం లేకపోతే మనం వివాహం చేసుకొంటే ఎట్లా ఉంటుందంటారు'. అతనలా అడిగేసరికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. 'మా పేరెంట్స్‌తో మీ విషయం చెబుతాను' అని వచ్చేశాను''. గడగడ చెప్పేసింది.

ఉమ పేరెంట్స్ తిడతారేమోనని నేను చూస్తున్నానా...కానీ వాళ్లు ఫక్కున నవ్వి, 'ఎందుకమ్మా, అంత గాభరా పడతావు?' అంటూ 'నీకు ఆ అబ్బాయంటే మంచి అభిప్రాయం ఉందా? ఉంటే చెప్పు. వాళ్ల పేరెంట్స్‌తో మాట్లాడతాము' అని చాలా కూల్‌గా చెప్పారు. నేను చాలా షాక్ అయ్యాను. మనింట్లో అటువంటి సంఘటన జరిగితే మీ రియాక్షన్ ఎట్లా ఉంటుంది?

'మనది పరువు, ప్రతిష్ట కలిగిన కుటుంబం. మనిళ్లలో అమ్మాయిలు పరాయి అబ్బాయి గురించి మాట్లాడకూడదు. పిచ్చి పిచ్చి వేషాలు వెయ్యవద్దని' గట్టిగా రంకెలు వేసి బి.పి. పెంచుకొంటారు.

తరువాత రామారావుగారు వెళ్లి సుధాకర్ పేరెంట్స్‌తో మాట్లాడడం, వాళ్లూ వీళ్లూ కలిసి ఒక నిర్ణయానికి రావడం జరిగింది. మూడు నెలలు తిరిగేసరికి సుధాకర్ వాళ్ల పద్ధతి ప్రకారం ముందు చర్చిలోనూ, తరువాత హిందూ పద్ధతి ప్రకారం వివాహం జరిపించి ఎంతో సంతోషంగా ఉన్నారు.

తరువాత రామారావుగారి అబ్బాయి కూడా ముస్లిమ్ అమ్మాయిని కావాలంటే అమ్మాయి వాళ్లింటికి మనం వెళ్లడమేమిటి అనుకోకూడదని రామారావుదంపతులు బయలుదేరి అబ్బాయి కోరుకొన్న ముస్లిం ఇంటికి వెళ్లి అనేక రకాలయిన అవమానాలను ఎదుర్కొని, వాళ్లకు అన్ని రకాలగాను నచ్చజెప్పి ఒప్పించారు. అమ్మాయి వాళ్ళు చాలా పేద కుటుంబం. అయినా సరే వాళ్లు చాలా మూర్ఖంగా మొండిగా ప్రవర్తించారు. చివరికి ఎట్లా అయితేనేమి వాళ్లను ఒప్పించి అబ్బాయి కోరుకున్న అమ్మాయితో వివాహం జరిపించారు. మన ఊళ్లో అందరూ రామారావుగారి గురించి చాలా హేళనగా మాట్లాడుకోవడం మనందరికీ తెల్సిందే.

ఆయన పిల్ల మాటలకు విలువనిచ్చి, తన ఆత్మగౌరవాన్ని చంపుకొని, ఎన్నో రకాల అవమానాలను ఎదుర్కొన్నారు. ఎవరి గురించీ పట్టించుకోలేదు. తన పిల్లల సుఖ సంతోషాలు ముఖ్యమని అనుకొన్నారు. అందుకు ఫలితం ఆ పిల్లలు, కోడలు, అల్లుడు రామారావు దంపతులను నెత్తిన పెట్టుకొని చూసుకొంటున్నారు. కుటుంబం అన్నాక ఒకరి మాటకు ఒకరు విలువనిచ్చుకొంటేనే, ఆ ఇంట్లో సుఖ సంతోషాలు విరాజిల్లుతాయి. ఎంత ప్రశాంతంగా వాళ్ల జీవితం గడుస్తోందో ఒప్పుకోకపోయినా మీకూ తెల్సు.

రామారావుగారు గర్వంగా అంటుంటారు. 'మనకయితే దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది మాత్రమే. కానీ మేము క్రిష్టమస్, రంజాన్ కూడా చాలా గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకుంటాం'. ప్రతి పండక్కీ వియ్యాలవారితో కలిసి నవ్వుల మధ్య సంతోషంగా జరుపుకోవడం అలవాటుగా మారింది.

నాన్నా! పరువు ప్రతిష్టలే ప్రాణంగా ఉండే మీరు రామారావుగారిలా సంతోషంగా ఉన్నారా? ఒక్కసారి ఆలోచించండి నాన్నా. కట్న కానుకలతో అట్టహాసంగా మా వివాహాలు జరిపించారు. అక్క జీవితం అట్లా అవ్వడంలో వాళ్లతో పూర్తిగా తెగతెంపులు అయినట్లే. నా విషయంలో నా భర్త మంచి వారయినా మా అత్తగారి కోరికలకు అంతు ఉండక ఇప్పటికీ మీరు తీరుస్తూనే ఉంటారు. పెద్దన్నయ్య అత్తవారికి గర్వం. వాళ్లు మనుష్యుల్ని పురుగుల్లా చూస్తారు. చిన్నన్నయ్యా అత్తగారు వాళ్లు కొంచెం బెటర్. అయినా ఒక్క వియ్యాలవారన్నా మీతో సరదాగా గడిపిన నిమిషమేమన్నా మీకు గుర్తు ఉందా? నేనయితే అటువంటి సంఘటన ఒక్కటి కూడా చూడలేదు.

నాన్నా! కొంచెం ఎక్కువ రాసి మీ మనసు కష్టపెట్టాను కదూ. కానీ నాన్నా ఇప్పుడు కూడా నేను నోరు విప్పకపోతే అక్కకూతురు జీవితం సక్రమంగా ఉండదన్న ఆతృతతో రాసేస్తున్నాను. నాన్నా! గుంటూరు సంబంధం అన్ని రకాలుగానూ చాలా బాగుంది.

ఎవరేమనుకొంటారో అన్న భావం నుండి బయటపడి, 'నా కుటుంబం, నా పిల్లల సుఖ సంతోషాలు' అని ఆలోచిస్తే మీ చివరి జీవితం ఆనందంగా గడపవచ్చు. మనం చేసే పని తప్పుకాదు అని మనసుకు అన్పించినప్పుడు ఎవరి గురించో భయపడి మన కుటుంబం ఆనందాన్ని పోగొట్టుకోకూడదు. మీరూ, అమ్మ ఆలోచించి ఒక నిర్ణయానికి రండి.

మనింట్లో పరువూ, ప్రతిష్ట కావాల్సిన దానికన్నా ఎక్కువ ఉన్నాయికానీ, కుటుంబ సభ్యులంతా చేరి సమైక్యతగా ఒక్క విషయం కూడా చర్చించుకోము. ఒకరు 'ఔను' అంటే ఒకరు 'కాదు' అనడం, ఒకరి మాటకు ఒకరు విలువ ఇవ్వక పోవడం మనింట్లో జరగవు అంటే సంతోషపడాలి. ఎప్పుడు చూసినా హరి ఇట్లా అన్నాడు అని గిరి పీక్కోవడము, గిరి ఏదో అన్నాడని నేను పీక్కోవడమూ అందరం కలిసి అరుచుకోవడం.

మాలో సమైక్యత లేకపోవడానికి కూడా పరోక్షంగా అమ్మా, మీరే కారకులయ్యారు. ఒకరిని ఒకలా, ఒకరిని ఒకలా చూడడం వల్ల ఒకరి మీద ఒకళ్లకు ద్వేషాలు పెరిగి ఇట్లా తయారయ్యాము. మరిప్పుడన్నా మారి కూతురు పిల్లలను, కొడుకు పిల్లలను సమానంగా చూస్తే వాళ్లన్నా కలిసిమెలిసి ఉంటారు.సరే నాన్నా. అక్క కూతురు రమ సంబంధం గురించి అవసరమైన టాపిక్స్, అనవసరమైన టాపిక్స్ చాలా వ్రాశాను.

ఈ విషయం అన్నయ్య లిద్దరినీ పిలిచి కూర్చోబెట్టి, అమ్మ మీరు కలిసి చెప్పండి. మీకు మంచిగా తోస్తే, అది ఎందుకు మంచిగా అన్పించిందో క్లియర్‌గా అర్థమయ్యేటట్లు చెప్పండి.

అమ్మకు నమస్కారములు.

ఏ విషయం మీరు ఫోను చేస్తారని ఆశిస్తున్నాను.

నమస్కారములతో-

అరుణ.

లెటరు చదవడం పూర్తి చేసిన పరంధామయ్యగారు ఒక నిర్ణయానికి వచ్చినట్లు "లక్ష్మీ" భార్యను పిలిచారు.

"లక్ష్మీ, ఈరోజు ఫోను చేసి గిరిని రమ్మంటాను. హరితోనూ, గిరితోనూ మాట్లాడి గుంటూరు సంబంధం ఖాయం చేసుకొందాం"

భర్త మాటలు విన్న లక్ష్మీదేవికి ఆనందంతో నోటమాట రాలేదు.